క్లుప్తంగా

దానాలతో పితృ దేవతలకు సంతృప్తి



వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: మహాలయ అమావాస్య నాడు దానాలు చేయడం ద్వారా పితృ దేవతలు సంతోషిస్తారని ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష అన్నారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో వృద్ధులకు నూతన వస్త్రాలు, భోజనం ప్యాకెట్లను అప్పన హనుమంతరావు కుటుంబ సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి కృష్ణమోహన్, అడబాల రత్నప్రసాద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన కఠినంగా ఉండాలి

కాకినాడ రూరల్: యువత జీవితాలను నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ కోరారు. జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవిత కాలం దానికి బానిసలుగా బతకాలన్నారు. గుట్కా, పాన్ పరాగ్, సిగరెట్లు, గంజాయి, మద్యం వంటివి వాడడం వలన తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రాధాన్యాన్ని చాటిన శాస్త్రి

బోట్‌క్లబ్: రైతు ప్రాధాన్యాన్ని చాటిన గొప్ప దేశ నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ కొనియాడారు. స్థానిక రామకృష్ణారావుపేటలోని బుధవారం లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. జై జవాన్-జై కిసాన్ నినాదంతో అందరికీ అన్నం పెట్టే రైతు ప్రాధాన్యాన్ని. దేశానికి రక్షణగా నిలిచే సైనికుడి గొప్పతనాన్ని చాటి చెప్పారన్నారు. నైతిక ధర్మాచరణ, దృఢ సంకల్పం, ప్రజోపయోగకరమైన నిర్ణయాలతో స్వాతంత్ర్య ఫలాలు అందిరికీ అందేలా ఆయన శాయశక్తులా కృషి చేసిన మహనీయుడన్నారు. నిరాడంబరత, సత్యనిష్ఠతో పాటు, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దేశ సేవే లక్ష్యంగా పనిచేశారన్నారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘ఉచిత ఇసుక’ పై 4న సీపీఎం ధర్నా

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ అమలు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే ఆచరణలో ఇసుక సరఫరా స్తంభించి, నిర్మాణ రంగ కార్మికులు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల కూడా నెరవేరని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఉచిత ఇసుక హామీ విషయంలో ప్రస్తుత పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం యంత్రాంగం స్పందించి, తక్షణం ఉచిత ఇసుక హామీని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికుల క్లెయిమ్స్ పరిష్కారం చేయాలన్నారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వీరబాబు పిలుపునిచ్చారు.

మద్యం షాపు పెట్టవద్దు

కాకినాడ సిటీ: నగర నడిబొడ్డున టీటీడీ కల్యాణ మండపం వెనుక బాలాజీ చెరువు ప్రాంతంలోని నివాసాల మధ్య బ్రాందీ షాపు పెట్టి ఆ ప్రాంతాన్ని పాడు చేయడవద్దని ఆ ప్రాంత ప్రజలు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. పీఆర్ కాలేజీ, ఇతర స్కూల్స్, విద్యార్థులు, మహిళలు, పిల్లలు, ప్రజలకు ఎక్కువ ఇబ్బంది ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కాకినాడ రమణయ్యపేటలోని సచివాలయం-1 విద్యుత్ స్టేషన్ దగ్గర బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. బైక్‌పై ఓ వ్యక్తి వెళ్తుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. వర్షం కారణంగా కారు అదుపు తప్పినట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడి వివరాల కోసం సర్పవరం పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

కరుణించు తల్లి భవానీ..

- నేటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు
- నగరంలో ముస్తాబైన ఆలయాలు
- భక్తులు ఆకట్టుకునేలా భారీ సెట్టింగులు
- వివిధ అలంకరణల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు



మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాలను గురువారం నుంచి 12 వరకూ నగరంలో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నిబంధనలకు అనుగుణంగా దర్శనాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులను ఆకట్టుకునే విధంగా ఆలయ ముఖద్వారం వద్ద భారీగా సెట్టింగులు నెలకొల్పారు. అమ్మవారు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ప్రతి రోజు భక్తులను ఆకట్టుకునేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమాలిలా..

స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 3న విల్లంబులు, 4న ఊయల, 5న పుస్తకపాణి, 6న వీణాపాణి, 7న జపమాల, 8న సింహారోహణం, 9న రక్తబీజాక్షుని వధ, 10న శుంభ, నిశుంభల వధ, 11న మహిషాసురమర్ధిని, 12 బంగారం చీరలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. స్థానిక మాధవ నగర్‌లోని కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఎన్‌వీ సాయిబాబా తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12 వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. 3న గాయత్రిదేవి, 4న విజయలక్ష్మీదేవి, 5న సరస్వతీదేవి, 6న రాజరాజేశ్వరిదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న కాళికాదేవి, 9న కనకదుర్గాదేవి, 10న చాముండీదేవి, 11న మహిషాసురమర్ధిని, 12న బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణల్లో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి అర్చన, కుంకుమ పూజ, చండీహోమం, నీరాజన మంత్రపుష్పం జరుగుతాయని వివరించారు. వీటితో పాటు నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



బాలాత్రిపుర సుందరి ఆలయంలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ముఖద్వారం



కామాక్షి అమ్మవారి ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లను వివరిస్తున్న కమిటీ సభ్యులు



పెద్ద శివాలయంలో చేసిన ఏర్పాట్లు

కామాక్షి అమ్మవారి ఆలయంలో..

సంతచెరువు వద్ద నున్న కామాక్షి అమ్మవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 13 వరకూ ఉత్సవాలు జరుతుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షులు చేబ్రోలు కృష్ణ తెలిపారు. ఆలయంలో బుధవారం కమిటీ సభ్యులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, నవావరణార్చన పూజలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కట్ల రాంబాబు, చెల్లూరు సత్యానారాయణ, సభ్యులు పొన్నాడ బ్రహ్మానందం, అర్చకులు నాగేంద్రచారి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు పీఆర్ విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్: నేషనల్ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా క్రీడా మండలి మైదానంలో గత నెల 30న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, కాకినాడ జిల్లా స్థాయి, ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే అండర్-14 ఖో-ఖో బాలుర జట్టుకు సీహెచ్ కౌశల్, అనకాపల్లిలో జరిగే అండర్-17 బాలుర ఖో-ఖో జట్టుకు టీఎస్‌వీఎస్ సాయి మణికంఠ, కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే అండర్-19 బాలుర ఖో-ఖో జట్టుకు కె.చిన్నసత్యం, ఏలియా ఎంపికై నట్టు పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం ఏఆర్‌కేవీ ప్రేమజ్యోతి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హరీష్ అభినందించారు. వీరికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని, రాష్ట్ర స్థాయి పోటీల్లో చక్కగా రాణించి పాఠశాలకు మంచి పేరు తేవాలని స్థానిక నాయకులు గోపిశెట్టి భూరయ్య, మనోహర్ గుప్త, పసుపులేటి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ నేత కన్నబాబుకు పలువురి అభినందనలు



కన్నబాబుకు అభినందనలు తెలుపుతున్న కొప్పన శివ తదితరులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును బుధవారం పలువురు అభినందనలు తెలిపారు. స్థానిక రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కన్నబాబును పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు కొప్పన శివ, వాసిరెడ్డి జమీలు, రౌతులపూడి జెడ్పీటీసీ దివాణం, జేసీఎస్ జిల్లా కన్వీనర్ బత్తుల సాయి, మాకినీడి శేషుకుమారి, రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ సుజాత తదితరులు కలిశారు. కన్నబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు, పార్టీ పటిష్టత కోసం కన్నబాబు వెంట నడుస్తామని వారు స్పష్టం చేశారు.

గాంధీ భవన్‌కు తోడ్పాటు అందిస్తా

- కలెక్టర్ షణ్మోహన్ సగిలి



గాంధీభవన్‌లో గాంధీ విగ్రహానికి నూలు దండ వేస్తున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి



డాక్టర్ తనికెళ్ల, కొముండూరి కాంస్య విగ్రహాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గాంధీ భవన్ కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని, ఇటువంటి ఉన్నతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న గాంధీభవన్‌కు తన తరఫున, ప్రభుత్వం తరఫున తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి నూలు దండ సమర్పించారు. నందమూరి వీరవెంకట వినోద్ తయారు చేయించిన గాంధీ భవన్ వ్యవస్థాపకులైన డాక్టర్ తనికెళ్ల సత్యనారాయణ మూర్తి, కొముండూరి శఠగోపాలాచార్యులు కాంస్య విగ్రహాలను కలెక్టర్ ఆవిష్కరించారు. గాంధీభవన్ ప్రాంగణంలోనే బెంగళూరుకు చెందిన కెప్టెన్ ప్రభల సుబ్బారావు ఆధ్వర్యంలో ఉన్నతి సంస్థ ద్వారా యువతకు ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయగా, కలెక్టర్ ప్రారంభించారు. గాంధీభవన్ అధ్యక్షుడు వీఎల్ గాంధీ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, తద్వారా ఉద్యోగం పొందాలని కోరారు. శిక్షణా కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందిస్తున్న కెప్టెన్ ప్రభల సుబ్బారావు, విగ్రహాలు బహూకరించిన నందమూరి వినోద్‌ను కలెక్టర్ సత్కరించారు. గాంధీ జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు సత్యనారాయణ, కాదా వెంకటరమణ, సత్యన్నారాయణ, అల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛ కాకినాడ లక్ష్యం కావాలి

ఎమ్మెల్యే కొండబాబు



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ భావన, ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ: పరిసరాల పరిశుభ్రతను కాపాడడం ద్వారా కాకినాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు తోడ్పడాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా బుధవారం వివేకానంద పార్కు నుంచి మెక్లారిన్ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే వనమాడి, నగరపాలక సంస్థ కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. కమిషనర్ భావన మాట్లాడుతూ గత నెల 17 నుంచి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించామని చెప్పారు. నగరాన్ని క్లీన్ కాకినాడగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ బీచ్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవ

కాకినాడ రూరల్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఉన్న ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బీచ్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ వలంటీర్ల చొరవతో ఎన్టీఆర్ బీచ్‌లోని వ్యర్థాలను తొలగించారు. బీచ్‌ను శుభ్రపరచి, ఆ వ్యర్థాలను కాకినాడ గ్రామీణం పంచాయతీ పారిశుధ్య విభాగం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం పోచయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం శ్రీదేవి, డాక్టర్ కె.హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అహింసతోనే అన్నీ సాధ్యం

వైఎస్సార్ సీపీ నేత కన్నబాబు



గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: పోరాటమంటే ఆయుధాలతో చేసేది కాదని, అహింసతో ఏదైనా సాధించవచ్చని ప్రపంచానికి చాటిన మహాత్ముడు గాంధీజీ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా స్థానిక రమణయ్యపేట వైద్య నగర్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు ఆయన ఘన నివాళులర్పించారు. కన్నబాబు మాట్లాడుతూ గాంధీ, శాస్త్రి వంటి మహాత్ముల త్యాగాలతో స్వేచ్ఛాయుత జీవితాన్ని అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు కురసాల సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ బందిలి విరీష, శేషుకుమారి, మాజీ కార్పొరేటర్ సుజాత, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా మండల పరిషత్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఈశ్వర్‌కుమార్



గాంధీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కమిషనర్ భావన



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్పర్తి

బాలాజీచెరువు: అహింస అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. వర్సిటీ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి ఆహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన మహనీయుడు గాంధీజీ అని, ఆయన జీవిత చరిత్ర నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అలాగే మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో..

అలాగే నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బీచ్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జనప్రియ నర్సింగ్ కళాశాలకు చెందిన 350 మంది విద్యార్థులు, జైభీమ్ ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

బోట్‌క్లబ్: గాంధీ జయంతి సందర్భంగా స్థానిక వివేకానంద పార్కులో బుధవారం లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున పారిశుధ్య కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రీజనల్ చైర్మన్ పద్మతులసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించి, నూతన వస్త్రాలు, న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా 16 లయన్స్ క్లబ్‌లకు మొక్కలను అందించారు. తొలుత గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్లు బాదం బాలకృష్ణ, బాబూజీ, కోటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాస్, క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అహింస మార్గంలో పయనించాలి

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ హింసను విడనాడి, అహింస మార్గంలో పయనించాలని పశ్చిమ గోదావరి జిల్లా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు అన్నారు. కాకినాడ సఖి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని స్థానిక విముక్తి కాలనీలో బుధవారం నిర్వహించారు. బాబూజీరావు సౌజన్యంతో విముక్తి కాలనీలోని పేదలకు అన్న, వస్త్ర దానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సహనం, శాంతి, సమానత్వం, అహింసా మార్గాలను ఆచరించాలన్నారు. సఖి లయన్స్ క్లబ్ సభ్యులు నాగలక్ష్మి, రమణి, సావిత్రి, అన్నపూర్ణ, స్వప్న పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నివాళి

కాకినాడ సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తన కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఆర్ రమేష్, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాపూజీ రచనలు మార్గదర్శకం

- జిల్లా జడ్జి కమలాదేవి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ప్రతి ఒక్కరూ బాపూజీ రచించిన గ్రంథాలను చదవాల్సిన అవసరం ఉందని, మార్గదర్శకమైన వీటి ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ హాలులో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాపూజీ అనుసరించిన సత్యం, అహింస విధానాలను సమాజంలో ప్రతి ఒక్కరూ ఆచరించడం ద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చెక్క శ్రీనివాస్, కోశాధికారి వెంకట రెడ్డి బహదూర్ షా, కేవీసీ భద్రరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్తదానం

గాంధీ జయంతి సందర్భంగా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రక్తదానం చేశారు.

మహాత్ముని జీవితం ఆదర్శప్రాయం

వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర

కాకినాడ: స్వాతంత్ర్య సముపార్జన కోసం ఎనలేని సేవలు అందించిన జాతిపిత మహాత్మా గాంధీ సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసన్న మాట్లాడుతూ మహాత్మా గాంధీ చేసిన త్యాగం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీరెడ్డి(చిన్నబాబు), రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు మాకినీడి శేషుకుమారి, నల్లబెల్లి సుజాత, గద్దేపల్లి దాసు, బుర్రా రమణ, సంగాని నందం, బొడిరెడ్ల పుష్ప, కర్రి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నగరపాలక సంస్థ కమిషనర్ భావన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎస్ఈ సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.